'మధ్యాహ్నం' మరింత రుచిగా

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పౌష్టికాహారం వడ్డింపు
- జిల్లాలో 1,195 పాఠశాలల్లో 'జగనన్న గోరుముద్ద' అమలు
- అదనంగా రాగి జావ, చిక్కీలు అందజేత
- పాఠశాలల్లో మినరల్ వాటర్ ఏర్పాటు

పేద విద్యార్థులు చదువు మధ్యలో వదిలేసి వెళ్లరాదని ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా సర్కారు బడుల్లో మధ్యాహ్నం భోజనాన్ని అందజేస్తుంది. గతంలో పురుగుపట్టిన బియ్యం, నాణ్యతలేని భోజనం వడ్డిస్తుండటంతో పిల్లలు తినలేకపోయేవారు. జగనన్న సీఎం అయ్యాక పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని నిర్ణయించి పటిష్టమైన మెనూ రూపొందించారు. రాగిజావ, చిక్కీలు, రోజూ గుడ్డు, కూరగాయలు తదితర వాటితో రుచికరమైన, నాణ్యమైన భోజనం అందజేస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గోస్పాడు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు


జిల్లెల్లలో భోజనాలు చేస్తున్న చిన్నారులు

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహార పదార్థాలతో మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా ప్రత్యేక మెనూ ఏర్పాటు చేసింది. పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువులోనూ రాణిస్తారని ఉద్దేశంతో రోజుకో రకంగా జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తుంది. జిల్లాలో 1,195 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 863 ఎంపీపీ పాఠశాలల్లో 46,351, 150 యూపీ పాఠశాలల్లో 14,881, 182 హైస్కూల్లో 59,969 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మొత్తం 1,21,201 మంది విద్యార్థులు ఉన్నారు.

మారిన మెనూ..

గతంలో ఏర్పాటు చేసిన మెనూలో సరైన పౌష్టిక ఆహారం లేదని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని నాణ్యమైన మెనూ తీసుకొచ్చింది. గతంలో ఇచ్చే ఆహార పదార్థాల్లో పప్పు, సాంబారు, రసం, ఆకుకూరలు వంటి ఇతర ఆహార పదార్థాలు అంతంత మాత్రంగానే ఉండేవి. అంతేకాకుండా వారానికి రెండు గుడ్లు మాత్రమే అందించేవారు. ప్రస్తుతం అలా కాకుండా ఆహార పదార్థాల్లో శనివారం మినహా ప్రతిరోజు ఉడికించిన ఒక గుడ్డు ప్రతి విద్యార్థికి అందేలా ఏర్పాటు చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందిస్తూనే సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రతి విద్యార్థికి బెల్లం, వేరుశనగ చిక్కి, మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 11 గంటలకు రాగి జావ అందిస్తున్నారు. శనివారం మాత్రం మధ్యాహ్న భోజనంతో పాటు ప్రత్యేకంగా స్వీట్ పొంగలి వడ్డిస్తున్నారు. రోజూ వంట నిర్వాహకులు చేసే ఆహార పదార్థాలను విద్యార్థులకు ఇచ్చే ముందు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలించడాన్ని తప్పనిసరి చేసింది.

తాజా గుడ్లు సరఫరా...

విద్యార్థులకు అందించే గుడ్లు తాజాగా ఉండేందుకు ఎప్పటికప్పుడు వారంకోసారి చొప్పున నెలకు నాలుగు సార్లు గుడ్లను సరఫరా చేస్తున్నారు. గతంలో ఏజెన్సీల నిర్వాహకులు ఎప్పుడు పడితే అప్పుడు అందజేసేవారు. ఒకేసారి ఇస్తుండటంతో రోజుల తరబడి నిల్వ ఉండి చెడిపోయేవి. దీంతో అటు వంట నిర్వాహకులు దెబ్బతిన్న గుడ్లతో అవస్థలు పడగా ఇటు విద్యార్థులు తినలేకపోయేవారు. ప్రస్తుతం వారానికొకసారి పాఠశాలలకు గుడ్లు సరఫరా చేస్తున్నారు.

నూతన మెనూ..

సోమవారం : హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పులావ్, గుడ్డు కూర, చిక్కీ,
మంగళవారం: పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ,
బుధవారం: వెజిటబుల్ బిర్యానీ, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం : సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం : కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, ఆకుకూర, సాంబారు
శనివారం: తీపి పొంగలి, రాగి జావ

పాఠశాలలోనే భోజనం చేస్తా



రోజూ మధ్యాహ్న భోజనం మా పాఠశాలలో చేస్తున్నా. పాఠశాలకు పక్క గ్రామం నుంచి వస్తున్నాం. ఇంటి నుంచి క్యారేజీ తెచ్చుకోవాలంటే ఇబ్బందులే. ప్రభుత్వ పాఠశాలలో రోజుకో రకం భోజనాలు పెడుతున్నారు. చాలా బాగుంటున్నాయి. సంతోషంగా ఉంది.

– జ్యోతి, 7వ తరగతి విద్యార్థి, పసురపాడు

రోజూ గుడ్డు అందిస్తున్నారు



మధ్యాహ్న భోజనంలో వడ్డించే ఆహార పదార్థాలు ఎంతో బాగున్నాయి. వారంలో ఐదు రోజుల పాటు గుడ్డు ఇస్తున్నారు. రుచికరమైన ఆహార పదార్థాలు అందిస్తుండడంతో పాఠశాలలోనే భోజనం చేస్తున్నా. పాఠశాలలో చిక్కీలు, రాగిజావ కూడా అందిస్తున్నారు.

–అరుణ్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి, జూలేపల్లె

వసతులు బాగున్నాయి



ప్రభుత్వ పాఠశాల అయినా విద్యార్థులకు సరిపడే అన్ని వసతులు కల్పించారు. గతంలో మధ్యాహ్నం ఇలా ఉండేది కాదు. ఇప్పుడు భోజనం ఎంతో రుచికరంగా రోజుకో రకమైన ఆహార పదార్థాలు అందిస్తున్నారు. రాగిజావ, గుడ్డు, చిక్కీలు అందజేయడం సంతోషంగా ఉంది.

– సుస్మిత, 8వ తరగతి విద్యార్థి, గోస్పాడు

సక్రమంగా అమలు చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో జగన్న గోరుముద్దలో భాగంగా పౌష్టికాహా రం అందిస్తుంది. గతంలో కంటే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో తినే విద్యార్థుల సంఖ్య పెరిగింది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ: మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలదస్తగిరమ్మ, మనీషా, తేజస్విని జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం నరసింహుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన అండర్–14, అండర్–17 తాడాట రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిచారు.

నేడు క్రీడా పోటీలు

మండల స్థాయి క్రీడా పోటీలను కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. అండర్–14, అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నిస్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగాలపై బాలబాలికలకు పోటీలు ఉంటాయని చెప్పారు.

13న జగనన్నకు చెబుదాం

శిరివెళ్ల: ఈ నెల 13వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. కలెక్టర్, జేసీ, ఇతర ప్రభుత్వ జిల్లా అధికారులందరూ హాజరవుతారని చెప్పారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా కలెక్టర్‌కు నివేదించుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్ల నాణ్యత పరిశీలన


రుద్రవరంలో రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీలో వేసిన సీసీ రోడ్లు నాణ్యతగానే ఉన్నాయని విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో మూడు గ్రామ సచివాలయాలుండగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సమయంలో రోడ్ల గురించి స్థానికులు ప్రస్తావించడంతో నిధులు మంజూరు చేయించారు. దీంతో సర్పంచు బైరి విజయలక్ష్మి రూ.10లక్షలతో బెస్త కాలనీలో సీసీ రోడ్లు వేశారు. సోమవారం విజిలెన్స్ అండ్ క్వాలిటీ అధికారులు రోడ్డు నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేఈ ఆయాజ్, పీఆర్ ఏఈ వెంకటరాముడు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగలమర్రి: స్థానిక ఎరుకల కాలనీలోనున్న 15వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త నాగమణి ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వం పౌష్టికాహర మాసోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. అనంతరం 11 మందికి పౌష్టికాహారం, సుమారు 40 మంది చిన్నారులకు బాలామృతం కిట్లు పంపిణీ చేశారు.

నేలతల్లిని కాపాడుకోవాలి


రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ

దొర్నిపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అడుగులు వేసి నేలతల్లిని కాపాడుకోవాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సోమవా రం మండలంలోని గుండుపాపల గ్రామంలో రూ.10వేల విలువ చేసే 30రకాల వైఎస్సార్ ప్రకృతి వ్యవసాయ కిట్లను పొదుపు మహిళలకు అందజేశారు. సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, మండల వ్యవసాయాధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధాకర్, డివిజన్ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు, ఆర్‌బీకే వీఏఏ గోవర్ధన్, సచివాలయ కన్వీనర్లు రాముడు, నాగేశ్వరయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీ ప్రమాణస్వీకారం

గోస్పాడు: యాళ్లూరు గ్రామంలోని శ్రీ ఉమాసహిత నీలకంఠేశ్వరస్వామి, శ్రీలక్ష్మి మాధవస్వామి దేవస్థానాల చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ఉమాసహిత నీలకంఠేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా మూలచౌడేశ్వరరెడ్డి, సభ్యులుగా ఉమామహేశ్వరి, మహాలక్ష్మి, శ్రీకాంత్, లక్ష్మిదేవి, సుబ్బలక్ష్మమ్మ, పోతూలూరయ్యను నియమించారు. శ్రీలక్ష్మి మాధవస్వామి దేవస్థానాల చైర్మన్‌గా కైప జగన్నాథరెడ్డి, సభ్యులుగా వెంకటయ్య, కైప లక్ష్మిదేవి, బుజలక్ష్మి, కొమ్ములక్ష్మిదేవి, సుబ్బమ్మ, రంగవాసవిని నియమించారు. ఉపసర్పంచ్ బొక్కెం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో దేవస్థాన ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఈఓ వీరయ్య సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సచివాలయ మహిళా పోలీసులు బదిలీ

చాగలమర్రి: మండలంలో వివిధ సచివాలయాల్లో మహిళా పోలీసులుగా విధులు నిర్వహిస్తున్న నలుగు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సోమవారం తెలిపారు. చాగలమర్రి సచివాలయం–1లో విధులు నిర్వర్తిస్తున్న కె.సునంద వైఎస్సార్ జిల్లా, మైదుకూరు మున్సిపాలిటీ సచివాలయానికి వెళ్లగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న సౌభాగ్యలక్ష్మి చాగలమర్రి సచివాలయం–1కి బదిలీపై వచ్చి విధుల్లో చేరగా, చిన్నవంగలి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పి.వీరేశ్వరి వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం, జిల్లేల్ల గ్రామ సచివాలయానికి బదిలీ కాగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిత చిన్నవంగలి గ్రామ సచివాలయానికి వచ్చి విధుల్లో చేరగా, చాగలమర్రి సచివాలయం–4లో విధులు నిర్వహిస్తున్న పి.శ్రీలక్ష్మీ నెల్లూరు జిల్లా, మర్రిపాడు మండలం, కంపసముద్రం గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. కంపసముద్రం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పర్వీన్ చాగలమర్రి సచివాలయం–4లో చేరారని వివరించారు.పెద్దబోధనంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.షాహిదా వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆమె స్థానం భర్తీ కాలేదని చెప్పారు.

అమర వీరులకు నివాళి


రుద్రవరం అటవీ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

రుద్రవరం: జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక అటవీ కార్యలయం వద్ద రుద్రవరం రేంజి పరిధిలోని అధికారులు విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు అటవీ సంరక్షణ కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. సెక్షన్ అధికారులు శ్రీనివాసరెడ్డి,రాజెమ్మ, మక్తర్,ఎఫ్‌బీఓలు,ఏబీఓలు,ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో వెలసిన శ్రీ నాగలింగేశ్వరస్వామికి శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం, క్షీరాభిషేకం, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం జరిపించి రుద్రం నమకం చేపట్టారు. అలాగే పార్వతి దేవికి పూజల అనంతరం సామూహిక కుంమార్చన చేపట్టారు. అలాగే.. బైర్మల్ వీధిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత శ్రీవీర భద్రస్వామి దేవస్థానంలో శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాల అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాజుతో విద్యార్థులు

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జంప్‌రోప్ క్రీడలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రాజు సోమవారం తెలిపారు. ఈనెల 9న తెనాలిలో జరిగిన పోటీల్లో గాయత్రీ, పల్లవి, జ్యోత్స్న, జేజశ్వని, హన్సిక, కీర్తి, హరిణి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే పేరాయిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తనుషా, ప్రతిత ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నారు. మస్తాన్‌బీ సైక్లింగ్‌లో ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మహబూబ్‌బాషా తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

రుద్రవరం: రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు, పీడీని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ..ఈ నెల 9,10 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో మానస,స్పందన,అలేఖ్య,లక్ష్మీ వర్ధన్ గోల్డ్ మెడల్స్ సాధించగా హైమావతి, రాజేశ్వరీ సిల్వర్ మెడల్స్ సాధించారని చెప్పారు.

టీడీపీ బంద్‌కు స్పందన కరువు





నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలిలో యథావిధిగా కార్యకలాపాలు

- అన్ని సంస్థలు యథావిధిగా కొనసాగింపు
- ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

బొమ్మలసత్రం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడ్డారని భావించి కోర్టు రిమాండ్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే చంద్రబాబుకు మద్దతుగా కనీసం ఆపార్టీ నాయకులు బయటకు రావడానికి వెనుకాడారు. పట్టణంలో వ్యాపార సముదాయాలు, అన్ని కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. అవినీతి కేసులో చంద్రబాబు అరెస్ట్ అయితే తామేందుకు వ్యాపారాలు బంద్ చేసుకోవాలని వ్యాపారులు దుకాణాలు తెరచి వ్యాపారాలు కొనసాగించారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఉదయం తన అనుచరులతో కలిసి ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. బస్సులను తిరిగి డిపోలోకి పంపాలని బెదిరింపులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి తన సిబ్బందితో కలిసి బ్రహ్మానందరెడ్డితో పాటు ఆయన అనుచరులను అరెస్ట్ చేసి టూటౌన్ స్టేషన్‌కు తరలించారు.

భారీ బందోబస్తు

నంద్యాల జిల్లాలో సోమవారం నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. పలు ప్రాంతాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు.

టీడీపీ బంద్ విఫలం

ఆళ్లగడ్డ : తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించిన నేపథ్యంలో టీడీపీ నాయకులు చేపట్టిన బంద్ యత్నం పూర్తిగా విఫలమైంది. నాయకులు ఇచ్చిన పిలుపును ఏమాత్రం పట్టించుకోని ప్రజలు పట్టణంతో పాటు ఆరు మండల కేంద్రాలు, 104 గ్రామ పంచాయతీల్లో ప్రజా జీవనం యథావిధిగా కొనసాగింది. బంద్ చేపట్టాలని మాజీ మంత్రి అఖిలప్రియ మండల, గ్రామ నాయకులకు స్వయంగా ఫోన్ చేసి పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థల వారితోనూ మాట్లాడారు. అయినా వారి యూనియన్‌ల నుంచి ఒక్క ప్రకటన కూడా వెలవడలేదు. దీంతో తెల్లవారుజాము నుంచే ఎవరి పనుల్లో వాళ్లు మునిగిపోయారు. పబ్లిక్, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు సైతం మామూలుగా నడిచాయి. ఆర్టీసీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రోజులాగే నడిచాయి. కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా ఉదయం కొంత మేర కనిపించిన తెలుగు తమ్ముళ్లు 10 గంటల నుంచి సాయంత్రం వరకు రోడ్లపైన కనిపించలేదు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొదలు పెట్టిన రోజునుంచే ఎన్నికలకు ముందు చెప్పినట్లుగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పి.నాగిరెడ్డిపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పథకాల గురించి వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి ఏఏ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందనేది చదివి వివరించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఏఈ సురేంద్ర, నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, చిన్నరామిరెడ్డి, చిన్నవెంకటసుబ్బయ్య, గోపాల్, రాజ తదితరులున్నారు.

అర్జీలకు జవాబుదారీగా ఉండాలి

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలకు జవాబుదారిగా ఉండి బాధితులకు న్యాయం జరిగేలా చూడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులతో ఆయన మాట్లాడారు. ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు, ఏఓ రాజేంద్రకుమార్, హౌసింగ్ ఏఈ నరసింహరావు ఉన్నారు.

భర్తపై దాడి చేయించిన భార్య

దొర్నిపాడు: భర్తపై.. భార్య తన తల్లిదండ్రులతో దాడి చేయించిన ఘటన సోమవారం డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మౌలాలి తెలిపిన వివరాల మేరకు.. మూడు నెలల క్రితం ఓర్వకంటి రాజు అనే వ్యక్తికి బండిఆత్మకూరు గ్రామానికి చెందిన యేసేబు, మరియమ్మ దంపతుల కుమార్తె మంజులతను ఇచ్చి వివాహం చేశారు. రెండు నెలలుగా వీరి సంసారం సాఫీగా సాగింది. ఇంట్లో పనులు చేయడం ఇష్టంలేని మంజులత పుట్టింటికి వెళ్లి పోయింది. భర్త ఇంటికి రావాలని పెద్దలతో పంచాయితీ పెట్టించినా ఫలితం లేకపోయింది. సోమవారం మంజులత తల్లిదండ్రులు, అన్నా,వదిన అరుణ్, స్టెల్లా తదితరులు రాజు,అతని తల్లిపై దాడికి పాల్పడి తన వస్తులను తీసుకొని పుట్టింటికి వెళ్లారు. బాధితుడి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

గుండెపోటుతో తలారి మృతి


మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన తలారి దేగల పెద్దస్సురాయుడు(70) గుండెపోటుతో మృతి చెందాడు. విధి నిర్వహణలో భాగంగా ఆయన బయటకు వెళ్తుండగా గుండె నొప్పితో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వైద్యచికిత్స నిమిత్తం వాహనం తీసుకవచ్చేలోపే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15వేలు భార్య సుబ్బలక్ష్మమ్మకు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ గోవిందులు, వీఆర్ఓ ప్రవీణ్ ఉన్నారు.

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం రామాలయంలో మంగళవారం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద సోమవారం సర్పంచు గుండా లక్ష్మీదేవి,భక్తుల సమక్షంలో కర పత్రాలు ఆవిష్కరించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు వీరాంజనేయరావు, కొత్తపల్లె లక్ష్మీనరసయ్య, నరసింహుడు,రంగనాయకులు,వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి ఉన్నారు.

13 నుంచి క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నంద్యాల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బ్రహ్మం, నంద్యాల జిల్లా ఛీఫ్ కోచ్ రాజు, కోఆర్డినేటర్ గోపీ కృష్ణనాయక్, నంద్యాల నియోజకవర్గం ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ ఏపీ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్‌లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 13 న వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు పద్మావతీ నగర ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు, 14న నూనెపల్లె మునిసిపల్ హైస్కూల్‌లో కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ టెన్నికాయిట్ అథ్లెటిక్స్ పోటీలు, 15న కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని వివరించారు.

సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాదు కోరారు. స్థానిక సచివాలయం–2 పరిధిలో సోమవారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఓపీలో వచ్చిన 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చట్టానికి ఎవరూ చుట్టం కాదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

నంద్యాల: చట్టానికి ఎవరూ చుట్టం కాదని, మా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరి మీద కక్ష, కోపం లేదని సీఎం తపనంతా ప్రజా శ్రేయస్సు కోసమేనని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పద్మావతినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రూ.370 కోట్ల స్కామ్‌లో చంద్రబాబు అరెస్ట్ అయితే స్కిల్ స్కామ్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, దాని వల్ల ఇంత మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని, ఆధారాలు చూపిస్తూ చెప్పాల్సింది పోయి.. తనను కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఆ పార్టీ నాయకులంతా మాట్లాడుతున్నారు తప్పా..ప్రజలకు వాస్తవాలు వివరించలేకపోతున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా బంద్‌కు పిలుపునిస్తే ప్రజలు పట్టించుకోలేదన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదనేది ఆలస్యంగానైనా మరోసారి నిరూపితమైందన్నారు. జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, తిరుపంరెడ్డి, బుగ్గారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మోతుకూరు నాగేశ్వరరెడ్డి, ప్రవీణ్‌తేజ, పుల్లయ్య, సుబ్బరామయ్య, పుల్లారెడ్డి, శరభారెడ్డి పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నాడు–నేడులో భాగంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాఠశాలల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నాడు–నేడు పనులపై వర్క్‌షాప్ నిర్వహించారు. 189 పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్న సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణ పనులు సమస్యలు ఏమైనా ఉంటే అయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈనెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. మానిటరింగ్ అధికారి లలిత, ఎంఈఓ బ్రహ్మం పాల్గొన్నారు.

అధికారులు రారేమీ?


అధికారుల కోసం వేచి ఉన్న అర్జీదారులు

నంద్యాల(అర్బన్): గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు తహసీల్దార్ కార్యాలయానికి రావడం పరిపాటి. స్పందన కార్యక్రమంలో అధికారులు బిజీగా ఉన్నారంటూ సిబ్బంది చెప్పేవారు. అయితే సోమవారం కార్యాలయం మూసి వేసి ఉండటంతో గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు నిరీక్షించారు. టీడీపీ ఇచ్చిన బంద్‌తో కార్యాలయం మూసివేయడమే కాకుండా ఉదయం 11:30 దాటినా అధికారులెవరూ రాలేదు. తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. బంద్ సందర్భంగా టీడీపీ నాయకులు వస్తారేమోనని స్పందన ఆలస్యమైందని, కార్యాలయం మూసివేయడం తనకు తెలియదని చెప్పారు. కార్యాలయాన్ని తెరవాలంటూ సిబ్బందిని ఆదేశించారు.